సాక్షి ఖమ్మం

గురువారం । 15 । ఆగస్టు । 2024

గరిష్టం / కనిష్టం 31°/ 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశముంది.

అంతా సిద్ధం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం తొలుత భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెంలోని సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్ మోటార్లను స్విచ్చాన్ చేస్తారు. అనంతరం వైరాలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననుండగా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఇక వైరాలో సభాస్థలి వద్ద ఏర్పాటుచేయనున్న వ్యవసాయ, అనుబంధ శాఖల స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



వైరాలో సిద్ధమైన సభా ప్రాంగణం

నేడు ఉమ్మడి జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

- భద్రాద్రి జిల్లాలో 'సీతారామ' మోటార్ల స్విచ్చాన్
- వైరాలో రైతుసభలో ప్రసంగం, రుణమాఫీ చెక్కుల పంపిణీ
- వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యాన స్టాళ్ల ఏర్పాటు



వ్యవసాయ శాఖ స్టాల్‌లో డ్రోన్లు

15 ఎకరాల్లో సభాస్థలి

వైరాలోని శాంతినగర్ సమీపాన 15 ఎకరాల్లో సభా ప్రాంగణమంతా రైతు కళ ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. ఓవైపు రైతులను ఆకర్షించేలా స్టాళ్లు, మరోవైపు సీఎం ప్రసంగాన్ని వీక్షించేలా భారీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల లోపు రుణమాఫీ చెక్కులను ఇదే వేదికపై అందజేయనుండడంతో భారీగా రైతులను తరలించడంపై కాంగ్రెస్ నేతలు దృష్టి సారించారు. ములకలపల్లి మండలం పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌ను ప్రారంభించాక సీఎం నేరుగా వైరా చేరుకుని గంటన్నర పాటు ఇక్కడే ఉంటారు. సీఎంతోపాటు డిప్యూటీ సీఎం విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహా ఇంకొందరు మంత్రులు ఈ సభలో ప్రసంగించనున్నారు. కాగా, వ్యవసాయంతో అనుబంధ శాఖల ఆధ్వర్యాన 32 స్టాళ్లు ఏర్పాటుచేస్తుండగా ఆయా శాఖల ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలను వివరించనున్నారు.

జన సమీకరణపై దృష్టి

ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి రెండోసారి ఉమ్మడి జిల్లా పర్యటనకు వస్తున్నారు. తొలిసారి భద్రాచలంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ తర్వాత ఇప్పుడు ములకలపల్లి, వైరా వస్తుండడం.. వైరా వేదికపై రూ.2లక్షల రుణమాఫీ అమలు కానుండడంతో భారీ జన సమీకరణపై కాంగ్రెస్ నాయకులు దృష్టి సారించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. వైరా నియోజకవర్గంతోపాటు సత్తుపల్లి, మధిర, ఖమ్మం, పాలేరు, ఇల్లెందు నియోజకవర్గాల నుంచి రైతులను సభకు తరలించేలా ఏర్పాట్లుచేశారు.

భారీ బందోబస్తు

సీఎం సభను పురస్కరించుకుని భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పలుసార్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ వైరాను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బుధవారం కూడా ఆయన సభాస్థలిని పరిశీలించి బందోబస్తుపై సూచనలు చేశారు. కాగా, గురువారం సీఎం సభ సందర్భంగా ఆరుగురు ఏఎస్పీలు, 13 మంది డీఎస్పీలు, 35 మంది సీఐలు, 84 మంది ఎస్సైలు, 50 మంది ఏఎస్సైలు, 143 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 420 మంది కానిస్టేబుళ్లు, 320 మంది హోంగార్డులు, 75 మంది స్పెషల్ పార్టీ పోలీసులు కలిపి 1,146 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారు.



నగరంలోని ఐటీ హబ్ వద్ద ఓ షాపులో రద్దీ

పంద్రాగస్టు కళ !

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా అంతటా కళ సంతరించుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను మువ్వన్నెల రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అలాగే, జాతీయ జెండాలు, అలంకరణ సామగ్రి కొనుగోళ్లతో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు కిక్కిరిసి కనిపించాయి. కాగా, ఖమ్మం పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉదయం 9గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఆయన ప్రసంగం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అధికారులు తెలిపారు.

– ఖమ్మం సహకారనగర్

న్యాయ సేవలను వినియోగించుకోండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవడమే కాక.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సాయాన్ని అందుకునేలా అవసరమైన వారికి వివరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఖమ్మం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్న విషయాన్ని విద్యార్థులు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కేవలం చదువుపైనే దృష్టి సారించి మంచి స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కే.వీ.చంద్రశేఖరరావు మాట్లాడుతూ వివిధ వర్గాల వారికి ఉచిత న్యాయ సాయం అందించడంతో పాటు ప్రజల అభ్యున్నతికి న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. న్యాయ సేవా సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హన్మంతరావు, డీఐఈఓ కె.రవిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుణ్ కుమార్, న్యాయవాది సన్నే ఉదయ్‌ప్రతాప్‌తో పాటు కొళ్ల పాపారావు, శ్రీనివాసరావు, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు పాల్గొనగా వాటర్ ప్లాంట్, మిషన్ భగీరథ పంప్‌లను జిల్లా జడ్జి ప్రారంభించారు.

ప్రతీ గ్రామంలో ఆరోగ్య శిబిరాలు

నేలకొండపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్యం విషయమై అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి సూచించారు. మండల కేంద్రంలో బుధవారం పర్యటించిన ఆమె పనులను పరిశీలించాక అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇళ్లలోనే కాక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రహదారుల వెంట చెత్త వేయకుండా పర్యవేక్షించాలని చెప్పారు. అంతేకాకుండా జ్వరాల నియంత్రణకు ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలుఏర్పాటు చేయాలని, గ్రామ స్థాయిలో అన్ని శాఖల అధికారులు ఇంటింటా సర్వే చేయాలని సూచించారు. డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య, ఎంపీఓ శివ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సీపీ సునీల్‌దత్‌కు గ్యాలంట్రీ మెడల్



సునీల్‌దత్

ఖమ్మంక్రైం: పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ప్రతిష్టాత్మకమైన గ్యాలంట్రీ మెడల్‌కు ఎంపికయ్యారు. పోలీస్‌శాఖకు ఆయన అందించిన సేవలకు గాను కేంద్ర హోంశాఖ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పురస్కారాన్ని ప్రకటించింది. దేశ వ్యాప్తంగా పోలీస్, ఫైర్, డిఫెన్స్ సర్వీసుల్లో పనిచేసే పలువురు అధికారులకు అవార్డులు ప్రకటించగా జాబితాలో సీపీకి స్థానం దక్కింది. 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సునీల్‌దత్ భద్రాచలం ఏఎస్పీగానే కాక జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా, హైదరాబాద్ ఈస్ట్‌జోన్ డీసీపీగా విధులు నిర్వర్తించిన అనంతరం ఈ ఏడాది జనవరిలో ఖమ్మం పోలీస్ కమిషనర్‌గా నియమితులయ్యారు. సునీల్‌దత్ గ్యాలంట్రీ మెడల్‌కు ఎంపికవడంపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీసు అధికారులు అభినందించారు.

జమలాపురంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



పవిత్రోత్సవాలతో వస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు బుధవారం ప్రారంభయ్యాయి. ఈసందర్భంగా యాగశాలలో పూజలు చేసిన అర్చకులు.. ఆ తర్వాత శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం కలశస్థాపన, హోమం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ఈఓ కె.జగన్‌మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కేయూ దూరవిద్యలో ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధి సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(గతంలో ఎస్‌డీఎల్‌సీఈ)లో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ గణితం, బీఎల్ఐసీతో పాటు పీజీలో ప్రవేశాలకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు అధ్యయన కేంద్రంలో లేదా 98492 50633 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీసీ యువతకు నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: విద్యావంతులైన బీసీ నిరుద్యోగ యువతకు హైదరాబాద్‌లోని ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. వచ్చేనెల 1నుంచి 90రోజుల పాటు రెసిడెన్షియల్ విధానంలో కొనసాగే శిక్షణ సమయాన అభ్యర్థికి నెలకు రూ.4వేల చొప్పున స్టైఫండ్ అందుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి వంద మందికి శిక్షణ ఇవ్వనుండగా 18 నుంచి 25 ఏళ్ల వయస్సు ఉండి ఎస్సెస్సీ, ఇంటర్ అర్హత కలిగిన వారు ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు www.gbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని, వివరాల కోసం 0874-2227427, 95738 59598 నంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

- దరఖాస్తుల అప్రూవ్‌లో అక్రమాలు

ఖమ్మంక్రైం: మీ-సేవ కేంద్రాల ద్వారా విచారణకు వచ్చే దరఖాస్తులకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతి జారీ చేస్తున్న(అప్రూవ్) ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. ఖానాపురం హవేలీ పోలీసుస్టేషన్‌లో గతంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన కానిస్టేబుల్ మహేష్‌ను కొన్నాళ్ల క్రితం బదిలీ అయ్యారు. ఆ సమయాన ఆయన స్టేషన్ పాస్‌వర్డ్‌ను అక్రమంగా తెలుసుకున్నారు. ఆతర్వాత ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్ వేణుతో జత కలిశాడు. వీరిద్దరు కలిసి ఆర్‌టీఓ ఏజెంట్‌తో దందా ప్రారంభించారు. మీ సేవా కేంద్రాల ద్వారా రెండు పోలీసుస్టేషన్లకు వచ్చే దరఖాస్తులను వీరి వద్ద ఉన్న పాస్‌వర్డ్‌ల ఆధారంగా అప్రూవ్ చేస్తూ రూ.వేలల్లో దండుకుంటున్నారు. అయితే, నిర్దేశిత సమయానికి ముందే దరఖాస్తులు అప్రూవ్ అవుతుండడంతో గమనించిన అధికారులు విచారణ చేపట్టగా విషయం బయటపడింది. దీంతో ఇద్దరు కానిస్టేబుళ్లపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా సస్పెండ్ చేస్తూ సీపీ సునీల్‌దత్ ఉత్తర్వులు జారీ చేశారు.

నెరవేరుతున్న చిరకాల వాంఛ

- 42 లక్షల ఖాతాల్లోకి రుణమాఫీ
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, ఎమ్మెల్యే రాందాస్

వైరా: కృష్ణా, గోదావరి జలాలు ఉమ్మడి జిల్లాను తాకనుండగా జిల్లా ప్రజల చిరకాల కోరిక నెరవేరుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. వైరాలో సభ ఏర్పాట్లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి బుధవారం మంత్రి పరిశీలించి మాట్లాడారు. వైరా వేదికగాసీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ అమలుచేయనున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 42 లక్షల ఖాతాల్లో రూ.34 కోట్లు జమ చేయనుండడంతో 25వేల కుటుంబాలకు రుణ విముక్తి జరుగుతుందన్నారు. సీతారామ ప్రాజెక్టు ఇంకా 70 శాతం పూర్తి కావాల్సి ఉందని మంత్రి తెలిపారు. అయితే, ప్రతిపక్ష నాయకులు ఆత్రంతో అల్లుడు అత్త కాలు తొక్కిన చందంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. తొమ్మిది నెలలు కాకముందే బిడ్డ ఎలా పుడుతుందని ప్రశ్నించారు. చేతకానీ హామీలు కాకుండా.. ఇచ్చిన మాట ప్రకారం రైతులు, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, దార్నా రాజశేఖర్, మిట్టపల్లి నాగి, సాదు రమేష్‌రెడ్డి, కట్ల రంగారావు, దాసరి దానియేలు, ఏదునూరి సీతారాములు, కట్ల సంతోష్, పమ్మి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

80 రోజులు.. రూ.80 కోట్లు

- శరవేగంగా రాజీవ్ కెనాల్ పనులు
- ఈ కాల్వ ద్వారానే సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు
- సీతారామ ద్వారా తీరనున్న సాగునీటి కష్టాలు



సాగర్ ఆయకట్టును అనుసంధానం చేసే రాజీవ్ కెనాల్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కృష్ణమ్మ, గోదావరి కలయికతో ఉమ్మడి జిల్లా పంటల హబ్‌గా మారనుంది. సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు అందనున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో సీతారామ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టగా.. ఆయకట్టు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రాజెక్టు నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరచూ పర్యవేక్షిస్తున్నారు. సాగర్ ఆయకట్టును అనుసంధానం చేసే రాజీవ్ కెనాల్(ఏన్కూరు లింక్ కెనాల్) ఈ ప్రాజెక్టులో కీలకం కాగా.. కెనాల్ నిర్మాణానికి మే నెలలో రూ.80 కోట్లు కేటాయించగా.. 80 రోజుల లక్ష్యానికి గాను ఈ నెలలోనే పూర్తి కానున్నాయి.

సాగర్ ఆయకట్టుకు అనుసంధానం

సీతారామ ప్రధాన కాల్వ 102.225 కి.మీ. నుంచి సాగర్ ఎడమకాల్వకు రాజీవ్ కెనాల్(ఏన్కూరు లింక్ కెనాల్) ద్వారా గోదావరి జలాలు తరలించి వైరా ప్రాజెక్టు, లంకాసాగర్, సాగర్ ఆయకట్టుకు నీటి సరఫరా చేయొచ్చు. ప్రస్తుతం కెనాల్ పనులు తుదిదశకు చేరాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.80 కోట్లు కేటాయించడంతో ఈనెల చివరికల్లా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా జూలూరుపాడు, ఏన్కూరు మండలాల్లో 7,500 ఎకరాలు, వైరా ప్రాజెక్టు కింద 17 వేల ఎకరాలకే కాక సాగర్ ఆయకట్టు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలవుతుంది.

72వేల ఎకరాల ఆయకట్టు

సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ 9.85 కి.మీ. వద్ద మార్లేళ్లపాడు ఎత్తిపోతల పథకం నుంచి భద్రాద్రి జిల్లా పినపాక నియోజకవర్గంలో 15,795 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. కాగా, కాల్వల నిర్మాణానికి 252 ఎకరాల భూసేకరణ కలిపి అంచనా విలువ రూ.115.71 కోట్లుగా ఉంది. ప్రధాన కాల్వ 74వ కి.మీ. వరకు ఆయకట్టు ప్యాకేజీ-1 కింద 38 వేల ఎకరాలకు నీరు అందించేందుకు భూసేకరణ కలిపి రూ.663.49 కోట్లతో పనులు చేపడుతున్నారు. ఇందులో కాల్వల నిర్మాణానికి 1,658 ఎకరాలు సేకరించాలి. ఇక ప్రధాన కాల్వ 74వ కి.మీ. నుంచి 98వ కి.మీ. మధ్య ప్యాకేజీ-2లో కాల్వల నిర్మాణం ద్వారా 34వేల ఎకరాలకు నీటి సౌకర్యం సమకూరుతుంది. ఇందుకోసం 1,363 ఎకరాల భూమి సేకరణ చేయాల్సి ఉండగా.. రూ. 387.37 కోట్లు వ్యయమవుతుందని అంచనా. మొత్తంగా ప్యాకేజీ 1, 2 ద్వారా రూ.1,959.86 కోట్లతో 3,021 ఎకరాల భూమి సేకరించి 72వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించనున్నారు.

సత్తుపల్లి ట్రంక్ కెనాల్ 50 శాతం పూర్తి

ములకలపల్లి మండలం కమలాపురంలోని పంపుహౌస్-3 నుంచి సత్తుపల్లి ట్రంక్ కెనాల్‌కు నీటి సరఫరా జరుగుతుంది. ఇది మొత్తం నాలుగు ప్యాకేజీలుగా ఉండగా ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయి. తొలుత భూసేకరణ నిమిత్తం రూ.70 కోట్లు చెల్లించి సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఆపై మిగతా ప్యాకేజీల ద్వారా 3,428 ఎకరాల భూమి సేకరించి రూ.1,650 కోట్ల వ్యయంతో 1.52 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తారు. కాగా, ప్రధాన కాల్వ 110.65 కి.మీ. నుంచి 112.30 కి.మీ. మధ్య జూలూరుపాడు టన్నెల్ నిర్మాణం చేపట్టి పాలేరు లింక్ కెనాల్‌కు నీరు అందేలా చర్యలు చేపడుతున్నారు.

ప్యాకేజీ-13కు త్వరలోనే టెండర్లు

పాలేరు లింక్ కెనాల్‌లో భాగమైన ప్యాకేజీ-13 పనులకు త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఈ ప్యాకేజీలో 42 వేల ఎకరాల నూతన ఆయకట్టు సాగులోకి రానుంది. అలాగే, పాలేరు కింద సాగర్ ఆయకట్టుకు కూడా నీరు అందుతుంది. ఈ పనులు పూర్తయితే పాలేరు నియోజకవర్గంలో సాగునీటి కొరత పూర్తిగా తీరనుండడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నందున పనులు త్వరగానే పూర్తయ్యే అవకాశముంది.

రెండు పీఎస్‌ల అప్‌గ్రేడ్

ఎస్‌హెచ్‌ఓలుగా సీఐల నియామకం

ఖమ్మంక్రైం: చాన్నాళ్లుగా ప్రతిపాదనల్లో ఉన్న ముదిగొండ, ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్ల స్థాయిని అప్‌గ్రేడ్ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్నాళ్లు ఈ పోలీసుస్టేషన్లకు ఎస్‌ఐలు ఎస్‌హెచ్‌ఓలుగా కొనసాగుతుండగా ఇక నుంచి సీఐలు వ్యవహరిస్తారు. ఇందులో భాగంగా పలువురు సీఐలను బదిలీ చేశారు. ముదిగొండ ఎస్‌హెచ్‌ఓ(సీఐ)గా ఖమ్మం పీసీఆర్‌లో పనిచేస్తున్న అంజలిని, ఖమ్మం రూరల్ ఎస్‌హెచ్‌ఓగా వెయిటింగ్‌లో ఉన్న ముస్కా రాజును నియమించారు. ఇక ఖమ్మం రూరల్ సీఐ పోస్ట్ రద్దు కావడంతో ఆ స్థానంలో పనిచేస్తున్న రాజిరెడ్డిని ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అలాగే, సీఎస్‌బీ-1 ఖమ్మం సీఐగా ఉన్న ఓ.మురళిని పీసీఆర్ సీఐగా బదిలీ చేశారు.

నేడు రైతుల ఖాతాల్లోకి నగదు

- మూడో విడతగా రూ.2లక్షల వరకు రుణమాఫీ

ఖమ్మంవ్యవసాయం: మూడో విడత రుణమాఫీ నగదు గురువారం రైతుల ఖాతాల్లో జమకానుంది. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వైరాలో ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు రెండు విడతల్లో రూ.1.50లక్షల వరకు రుణాలను మాఫీ చేయగా చివరగా రూ.2లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తారు. అయితే, మూడో విడతలో జిల్లాలో ఎందరు రైతులకు పథకం వర్తిస్తుంది, ఎంత మొత్తం నగదు మాఫీ అవుతుందనే విషయమై బుధవారం రాత్రి పొద్దుపోయే వరకు స్పష్టత రాలేదని వ్యవసాయ, బ్యాంకింగ్ అధికారులు తెలిపారు. దీంతో మొదటి, రెండు విడతల్లో రుణమాఫీకి నోచుకోని రైతులు ఇప్పుడైనా తమకు వర్తిస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మొత్తం 3 లక్షల మందికి పైగా రైతులు రుణమాఫీకి అర్హులని తేల్చగా, మొదటి రెండు విడతల్లో 91 వేల మందికే వర్తించింది. మొదటి విడతలో 59,172 మంది రైతులకు రూ.264,22,51,892, రెండో విడతలో 33,942 మందికి రూ.రూ.262,50,56,893 నగదు జమ అయింది. మూడో విడత వివరాలు గురువారం వెల్లడయ్యే అవకాశముండగా ఎందరికి లబ్ధి జరుగుతుందో తేలిపోతుంది.

సీఎం సభకు భారీ బందోబస్తు

- ట్రాఫిక్ సమస్య రాకుండా పర్యవేక్షణ
- పోలీసు కమిషనర్ సునీల్‌దత్

వైరా: వైరాలో గురవారం జరిగే రైతు సదస్సుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యాన భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ వెల్లడించారు. వైరాలో బుధవారం ఆయన అధికారులు, సిబ్బందితో సమావేశమై సూచనలు చేశారు. సభకు హాజరయ్యే వారితో పాటు ఇతర వాహనదారులకు ఇక్కట్లు ఎదురుకాకుండా పర్యవేక్షించాలని సూచించారు. అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, వైరా ఏసీపీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

- వైరా సభావేదిక సమీపాన హెలీప్యాడ్‌ను అదనపు కలెక్టర్ మధుసూదన్ పరిశీలించారు.

పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

సీఎం పర్యటన సందర్భంగా సాధారణ ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా పలుచోట్ల వాహనాలు మళ్లించనున్నారు. ఆయారూట్లతో పాటు పార్కింగ్ వివరాలను పోలీసులు వెల్లడించారు. మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం నియోజకవర్గాల నుండి సభకు వచ్చే వారి వాహనాలను వైరాలోని కమ్మవారి కళ్యాణ మండపం, కేవీసీఎం డిగ్రీ కళాశాల సమీపాన పార్కింగ్–4 వద్ద నిలపాల్సి ఉంటుంది. వైరా, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల వాహనాలు బాలాజీ నగర్, రైతు వేదిక సమీపాన పార్కింగ్ – 1, 2, 3 వద్ద నిలపాలని సూచించారు. ఇక ఖమ్మం, రాజమండ్రి జాతీయ రహదారిపై వచ్చే భారీ వాహనాలను పెనుబల్లి, తల్లాడ వైపు నుండి కొత్తగూడెం మీదుగా మళ్లించనున్నారు. ఏన్కూరు సమీపాన జన్నారం క్రాస్, పల్లిపాడు–కొత్తగూడెం రహదారిపైకి వాహనాలను మళ్లిస్తామని, మధిర–పాలడుగు జంక్షన్ రహదారిపై వచ్చే వాహనాలను బోనకల్ క్రాస్ నుండి ఖమ్మంకు మళ్లించనున్నట్లు తెలిపారు.

వైరాకు రేవంత్ రెండోసారి

2015లో టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి ఆ పార్టీ తరఫున చేపట్టిన రైతు పోరు యాత్రలో భాగంగా వైరా వచ్చారు. ఇప్పుడు సీఎం హోదాలో రైతులకు రుణమాఫీ చెక్కులు అందించేందుకు వస్తుండడం విశేషం.



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

నకిలీ ఏసీబీ అధికారుల హల్‌చల్

రఘునాథపాలెం: రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో ఏసీబీ అధికారులు తనిఖీ చేస్తుండడంతో ఇదే అదునుగా రఘునాథపాలెంలోని కేజీబీవీలో ఏసీబీ పేరిట నకిలీ అధికారులు బుధవారం హల్‌చల్ సృష్టించారు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు కేజీబీవీకి రాగా.. ఇందులో ఇద్దరు షార్ట్(నిక్కర్లు) ధరించి ఉన్నారు. తాము ఏసీబీ అధికారులమని చెప్పడంతో వాచ్‌మెన్ గేటు తీయగానే లోపలకు వెళ్లి కలెక్టర్ ఆదేశించారంటూ ఫొటోలు తీస్తూ హడావుడి చేశారు. టిఫిన్, పాల వివరాలను ఆరా తీసిన వారు ప్రత్యేక అధికారి లత లేకపోవడంతో వెళ్లిపోయారు. కాసేపటికి వచ్చిన ఎస్‌ఓ ఉన్నతాధికారులతో మాట్లాడగా ఎవరూ తనిఖీలకు రాలేదని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

‘సీతారామ’లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు

ఖమ్మంమయూరిసెంటర్: సీతారామ ప్రాజెక్టు ముమ్మాటికీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మానస పుత్రిక అని, ఆయన స్వయంగా రూపకల్పన చేసి నిధులు కేటాయించారే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ అన్నారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తవుతుండగా.. బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టును వారే పూర్తిచేసినట్టుగా చెప్పుకోవడం గర్హనీయమని పేర్కొన్నారు. కాగా, వైరాలో గురువారం జరిగే సభకు హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి సీతారామ ప్రాజెక్టుపై వాస్తవాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఇక మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పులు మాట్లాడారని మంత్రులు చెప్పడం సరికాదన్నారు. ఉమ్మడి జిల్లాతో పాటుగా చుట్టుపక్కల జిల్లాలకు సాగునీరు అందించేలా సీతారామను రూపొందించింది ఎవరు, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించింది, ప్రస్తుతం కేటాయించిన నిధులెన్నో చెప్పాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు బెల్లం వేణు, నరేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన నాయకులు

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు ఇస్తున్న యూనియన్ నాయకులు

ఖమ్మంవైద్యవిభాగం: సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు బుధవారం తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన సమ్మె నోటీసు ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలు, టీమ్ లీడర్లు, ఆఫీస్ అసోసియేట్లు ఈనెల 20 నుంచి సమ్మెలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్, జిల్లా మేనేజర్, ఆస్పత్రి సూపరింటెండెంట్లకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీదేవి, ప్రణీతతో పాటు, ప్రసన్నకుమార్, శ్రీకాంత్, మజీద్, కృష్ణవేణి తదితరులు నోటీసు అందజేశారు.

కొవ్వొత్తుల ర్యాలీ

ఖమ్మం వైద్యవిభాగం: కోల్‌కత్తాలో ట్రెయినీ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన ఘటన గర్హనీయమని ఐఎంఏ బాధ్యులు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ హాల్ నుంచి జెడ్పీ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగగా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈమేరకు బాధ్యులను కఠినంగా శిక్షించడమేకాక భవిష్యత్‌లో వైద్యులపై దాడులు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు కంభంపాటి నారాయణరావు, జగదీష్, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు

అసిస్టెంట్ కమిషనర్‌గా విధుల్లో చేరిన వీరస్వామి



వీరస్వామికి శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులైన కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.వీరస్వామి బుధవారం విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఆయనకు ఉద్యోగులు, అర్చకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాల ఈఓలు కొత్తూరు జగన్మోహన్‌రావు, వీవీ.నర్సింహారావు, ఉద్యోగ సంఘాల బాధ్యులు, అర్చకులు తోటకూర వెంకటేశ్వర్లు, దాములూరి వీరభద్రరావు తదితరులు పాల్గొనగా వరంగల్ బదిలీ అయిన ఉద్యోగులు గౌరీశంకర్, సమతను సైతం సన్మానించారు.

నా కొడుకును మా అత్త అమ్మేసింది..

అమ్మలేదంటూ బాలుడిని తీసుకొచ్చిన మహిళ

ఖమ్మం క్రైం: ఖమ్మంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద బాలుడి విక్రయం విషయమై హైడ్రామా నడిచింది. ఓ మహిళ ఆమె కుమారుడిని తన అత్త రూ.5లక్షలకు అమ్ముకుందని ఆరోపిస్తుండగా.. అదేం లేదంటూ ఆమె బాలుడిని తీసుకురావడంతో గందరగోళం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రఘునాథపాలెంకు చెందిన నాగమణి కుమారుడు సాయికి ఖమ్మం నిజాంపేటకు చెందిన స్వప్నతో 2021లో వివాహం జరిగింది. వీరికి యశ్విన్ జన్మించాక సాయి మృతి చెందాడు. అప్పటి నుంచి యశ్విన్‌ను సాయి తల్లి నాగమణి పోషిస్తోంది. ఈక్రమంలో బాలుడిని హైదరాబాద్‌కు చెందిన వారికి రూ.5లక్షలకు అమ్మిందని.. ఇందులో స్థానిక ప్రజాప్రతినిధి భర్త పాత్ర ఉందని స్వప్న బుధవారం ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఫోన్ చేయగా నాగమణి బాలుడితో సహా వచ్చి యశ్విన్‌ను ఎవరికీ అమ్మలేదని, కావాలంటే స్వప్న తీసుకెళ్లవచ్చని చెప్పింది. ఇలా అత్తాకోడలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటుండడంతో పోలీసులు చివరకు బాలుడిని ఐసీడీఎస్ సిబ్బందికి అప్పగించగా విచారణ అనంతరం అప్పగిస్తామని తెలిపారు.

ఖమ్మం మార్కెట్‌కు త్వరలోనే మహర్దశ


ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలో పెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఒకటైన ఖమ్మం మార్కెట్‌లో నూతన నిర్మాణాలతో రూపురేఖలు మారనున్నాయని మార్కెటింగ్ శాఖ వరంగల్ ఆర్‌జేడీ, ఖమ్మం పర్సన్ ఇన్‌చార్జి ఉప్పల శ్రీనివాస్ తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యాన శ్రీనివాస్‌తో పాటు డీడీ పద్మావతి బుధవారం ఖమ్మం వచ్చారు. ఈసందర్భంగా వీరిని చాంబర్ కామర్స్ ప్రతినిధులు సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఖమ్మం మార్కెట్‌లో మిర్చి యార్డును అధునాతన డిజైన్లతో నిర్మించనుండగా, మోడళ్లు సిద్ధమవుతున్నాయని తెలిపారు. రైతులు, వ్యాపారులకు ప్రయోజనకరంగా ఉండేలా నిర్మాణాలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలంతో పాటు సోమా నర్సింహారావు, మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, యడ్లపల్లి సతీష్, గీతా వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కాగా, బుధవారం సాయంత్రం ఖమ్మం వచ్చిన రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉదయ్‌కుమార్.. ఆర్‌జేడీ శ్రీనివాస్, డీడీ పద్మావతి, డీఎంఓ అలీతో సమావేశమై చర్చించారు.

రాజకీయ నేత దౌర్జన్యం చేశాడని ఫిర్యాదు

ఖమ్మంక్రైం: సొంత స్థలాన్ని శుభ్రం చేసుకుంటుండగా ఓ వామపక్ష పార్టీ నేతతో పాటు మరొకరు వచ్చి దౌర్జన్యం చేశారంటూ ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఖమ్మం వేణుగోపాల్‌నగర్‌కు చెందిన కొమ్మిశెట్టి కోటయ్య బుధవారం తన స్థలాన్ని శుభ్రం చేస్తుండగా భాగం హేమంతరావు, తాళ్లూరి మధు వచ్చి ఈ స్థలాన్ని మోత్కూరి గోపాల్‌రావు వద్ద కొనుగోలు చేశామంటూ కోటయ్యపై దౌర్జన్యం చేశారు. ఈవిషయమై కోటయ్య ఫిర్యాదు చేయగా, విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

బావిలో పడి మహిళా రైతు మృతి

కామేపల్లి: ఓ మహిళా రైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. మండలంలోని పండితాపురానికి చెందిన ధర్మసోత్ కిషన్–నాగమణి(45) దంపతులు బుధవారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం నాగమణికి దాహం వేయడంతో బావి వద్దకు వెళ్లే క్రమాన జారి బావిలో పడగా మృతి చెందింది. ఆమెకు భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉండగా తండ్రి లాల్యా ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.



దుర్గావతి

విప్లవ వనిత

మూడేళ్ల కొడుకును పణంగా పెట్టి...

భగత్‌సింగ్‌ను కాపాడిన భాభీ

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌వీర్... వీరంతా ఆమెను 'దుర్గా భాభీ' అని పిలిచేవారు. సాయుధ పోరాటంతోనే బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమికొట్టగలం అని భావించిన దళంలో పిస్తోల్ పట్టిన తొలి విప్లవ వనిత దుర్గావతి దేవి. బ్రిటిష్ అధికారి సాండర్స్‌ను హత్య చేసిన భగత్‌సింగ్‌ను లాహోర్ నుంచి తప్పించేందుకు అతడి భార్య అవతారం ఎత్తిందామె. చరిత్ర పుటలలో కనుమరుగై పోయిన ఆ త్యాగమయి గురించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

'సైమన్ గోబ్యాక్' నిరసన కార్యక్రమం చేస్తున్న లాలా లజపతిరాయ్ మీద బ్రిటిష్ పోలీసుల లాఠీచార్జీ జరిగి ఆయన ప్రాణం పోయింది. పంజాబ్‌లో యువతకు మార్గదర్శిగా ఉన్న ఆ మహా నాయకుణ్ణి కోల్పోయినందుకు 'హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' (హెచ్ఎస్ఆర్ఏ) సభ్యులకు ఆగ్రహం వచ్చింది. ఇది స్వాతంత్ర్య సమరయోధుడు భగవతి చరణ్ ఓహ్రా నడుపుతున్న గ్రూప్. చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ తదితరులంతా ఇందులో సభ్యులు. వీరంతా కలిసి లాఠీచార్జిని ఆర్డర్ వేసిన బ్రిటిష్ ఆఫీసర్ స్కాట్‌ను చంపాలనుకున్నారు. నిర్ణయం అమలు పరచడమే తరువాయి.



టెలివిజన్ ఎపిసోడ్‌లో భగత్‌సింగ్, దుర్గా భాభీ

స్కాట్ బదులు సాండర్స్

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఈ ముగ్గురు 17 డిసెంబర్ 1928న లాహోర్‌లో పోలీస్ ఆఫీసర్ స్కాట్‌ను హతమార్చడానికి సిద్ధమయ్యారు. అయితే బైక్ మీద రావాల్సిన స్కాట్ కారులో, కారులోనూ రావాల్సిన మరో అధికారి సాండర్స్ బైక్ మీద రావడంతో అయోమయం నెలకొంది. అయినా సరే ఎదురుపడిన సాండర్స్‌పై మొదట రాజ్‌గురు, ఆ తర్వాత భగత్ సింగ్ తుపాకీ పేల్చి అతణ్ణి హతమార్చారు. లాహోర్ అంతా గగ్గోలు రేగింది. వందలాది మంది పోలీసులు అన్ని దారులు... బస్టాండ్లు... రైల్వేస్టేషన్లు కమ్ముకున్నారు. లాహోర్‌లో ఉండటం భగత్‌సింగ్‌కు ఏ మాత్రం మంచిది కాదు. అతణ్ణి తప్పించేవారు ఎవరు?

ఆమె వచ్చింది

భగవతి చరణ్ ఓహ్రా సతీమణి దుర్గావతిని అందరూ దుర్గాభాభీ అని పిలిచేవారు. సాండర్స్‌ని హత్య చేశాక భగత్‌సింగ్, రాజ్‌గురు నేరుగా దుర్గావతి దగ్గరకు వచ్చారు. అప్పటికి ఆమె భర్త వేరే పని మీద కలకత్తా వెళ్లి ఉన్నాడు. జరిగింది తెలుసుకున్న దుర్గావతి వెంటనే భగత్‌సింగ్‌ను లాహోర్ దాటించడానికి సిద్ధమైంది. జుట్టు కత్తిరించుకుని హ్యాట్ పెట్టి రూపం మార్చిన భగత్‌సింగ్‌కు ఆమె భార్యగా నటిస్తూ తన మూడేళ్ల కొడుకుతో మరుసటి రోజు సాయంత్రం లాహోర్ నుంచి డెహ్రాడూన్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో మొదటి తరగతి ప్రయాణికురాలిగా బయల్దేరదీసింది. వందలాది నిఘా కళ్ల మీద ఈ పని చేయడం చాలా ప్రమాదం... మూడేళ్ల కొడుక్కు కూడా ఏదైనా కావచ్చు అని భగత్‌సింగ్ ఆమెతో అన్నాడు. 'నా కొడుక్కు మరణం సంభవిస్తే ఒక దేశభక్తునిగా తన ప్రాణం అర్పించే అవకాశం వాడికి దక్కుతుంది' అని చెప్పి ఆమె ముందుకు కదిలింది. భగత్‌సింగ్ ఆధునికవేషంలో ఉన్న అధికారిగా, దుర్గావతి అతని భార్యగా, రాజ్‌గురు నౌకరుగా ఆ ప్రయాణం చేశారు. బ్రిటిష్ వాళ్లకు ఏ మాత్రం అనుమానం రాలేదు. భగత్‌సింగ్‌ను అలా క్షేమంగా కలకత్తా చేర్చి వెనక్కు వచ్చింది దుర్గావతి.

గొప్ప దేశభక్తురాలు

స్వతంత్ర పోరాటం చేస్తున్న భగవతి చరణ్ ఓహ్రాను వివాహం చేసుకునేనాటికి దుర్గావతికి 13 ఏళ్లు. పెళ్లి తర్వాతనే చదువుకుంది. ఇంట్లో ఇరుగు పొరుగు పిల్లలకు పాఠాలు చెప్పేది. సాయుధ పోరాటం చేయాలన్న భర్త ఆశయానికి మద్దతుగా నిలిచిందామె. భగత్‌సింగ్‌ను తన కన్నబిడ్డలా భావించింది. భగత్‌సింగ్ పార్లమెంట్‌లో బాంబు దాడి చేసి అరెస్ట్ అయ్యాక ఆ తర్వాతగాని అతడే సాండర్స్ హత్యలో ఉన్నాడన్న సంగతి పోలీసులకు తెలియలేదు. ఆ కేసు వాదనలను బ్రిటిష్ ప్రభుత్వం హడావిడిగా ముగించి అక్టోబర్ 7, 1930న తీర్పు వెలువరించి భగత్‌సింగ్‌కు మరణశిక్ష విధించింది. అయితే లాహోర్‌లో ఈ విచారణ జరుగుతున్నప్పుడు భగత్‌సింగ్‌ను తీసుకెళ్లే వ్యానుపై బాంబుదాడి చేసి అతణ్ణి కాపాడాలని ప్లాన్ చేసింది దుర్గావతి. వీలు కాలేదు.

భర్తను కోల్పోయి

భగత్‌సింగ్‌ను జైలు నుంచి రక్షించడానికి స్వదేశీ జ్ఞానంతో బాంబులు తయారు చేస్తూ ప్రమాదవశాత్తు భగవతి చరణ్ ఓహ్రా మరణించాడు. అంత కష్టాన్ని తట్టుకుని దేశం కోసం పోరాడాలనుకుంది దుర్గావతి. భగత్‌సింగ్ మరణశిక్ష విధించాక ఆగ్రహంతో బొంబాయి వెళ్లి బ్రిటిష్ గవర్నర్‌ను చంపాలనుకుంది. అయితే గవర్నర్ దొరకలేదు. మరో బ్రిటిష్ అధికారి మీద స్వయంగా గుళ్ల వర్షం కురిపించి పగ చల్లార్చుకుంది. భగత్ సింగ్ ఉరి (1931 మార్చి 23) తర్వాత తన వాళ్లంటూ ఎవరూ లేకపోవడం, పోలీసుల వెతుకులాట ఎక్కువ కావడంతో తనే వెళ్లి లొంగిపోయింది. మూడేళ్ల జైలు శిక్ష అనంతరం మొదట లక్నో ఆ తర్వాత ఘజియాబాద్‌లో పెద్దగా పబ్లిక్‌లో ఉండటానికి ఇష్టపడక స్కూల్ నడుపుతూ 1999లో తన 92వ ఏట మరణించిందా గొప్ప దేశభక్తురాలు, భారత తొలి సాయుధ పోరాట సమరయోధురాలు దుర్గాభాభీ.

ఇది సైనికుల సంగ్రామం

- ఇంటికొకరుగా ఆర్మీ జవాన్లు
- నాటి పీపుల్స్‌వార్ ఖిల్లా నుంచి నేడు దేశరక్షణకు సరిహద్దుల్లో యువకులు

ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలా ఈ ఊరికి ఉన్న ప్రత్యేకత 'దేశభక్తి'. దేశాన్ని కాపాడాలనే ధ్యేయంతో ఊరి యువకులు సైన్యం బాట పట్టారు. ఒకే ఊరి నుంచి ఇంటికి ఒక్కరు చొప్పున సుమారుగా 92 మందికిపైగా యువకులు సైన్యంలో తమ సేవలను అందిస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్ ఖిల్లాగా ఉన్న ఆ ఊరిని ఇప్పుడు ఆర్మీ జవాన్ల పుట్టినిల్లుగా పిలుచుకుంటున్నారు. ఆ ఊరు సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం. ఆ ఊరి ముచ్చట్లలోకి వెళదామా?

సుమారు 40 ఏళ్ల క్రితం కట్కూర్ గ్రామానికి చెందిన జేరిపోతుల డేనియల్ మిలిటరీలో జవాన్‌గా చేరాడు. ఆయన స్ఫూర్తితో గ్రామంలోని యువకులు సైన్యం బాటపట్టారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆర్మీలో చేరారు. జవాన్ స్థాయి నుంచి లాన్స్‌నాయక్, నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఇలా గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం 92 మంది ఆర్మీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. దాంతో జిల్లాలో కట్కూరు గ్రామం అంటే ఆర్మీజవాన్‌ల గ్రామంగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలో 1,014 కుటుంబాలుండగా జనాభా సుమారుగా 3,045 ఉన్నారు. అందులో మొత్తం గ్రామంలో 175 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. వీరిలో కొందరు ఇతర ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు.

- మాలోతు శ్రీనివాస్, సాక్షి, అక్కన్నపేట

దేశసేవ ఇష్టం...



దేశసేవ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే 1998లో భారతసైన్యంలో చేరాను. మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్ బెంగళూర్‌లో ట్రైనింగ్ చేశాను. కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నాను. కాశ్మీర్‌లో రాష్ట్రీయ విభాగంలో సేవలు అందించి అనేక టెర్రరిస్ట్ ఆపరేషన్లలో పాల్గొన్నాను. కాశ్మీర్ సేవలను గుర్తించి నాకు సుబేదార్ మేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు.

- పంజా సదయ్య, సుబేదార్

గర్వపడుతున్నా...



దేశరక్షణ కోసం సైన్యంలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా దేశం కోసం పని చేయడం ఆనందంగా ఉంది.

- కొయ్యడ శ్రీనివాస్, ఆర్మీ జవాన్

పోస్టల్ స్టాంపులు

యుద్ధం ముద్రలు

మహిళలు ఇల్లు విడిచి బయట అడుగు పెడితే వింతగా చూసే కాలంలో సాహసమే వెన్నెముకగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు ఎంతోమంది మహిళలు. వారి త్యాగాల వెలుగు చరిత్రకే పరిమితమైనది కాదు, వర్తమానంలోనూ స్ఫూర్తిని ఇస్తుంటుంది. ఎంతోమంది మహిళా స్వాతంత్ర్య సమరయోధుల పోస్టల్ స్టాంప్స్ విడుదల అయ్యాయి. ఈ చిన్న స్టాంప్‌లు వారి త్యాగాలు, పోరాట పటిమను ప్రతిఫలిస్తాయి. పోస్టల్ స్టాంప్స్‌పై మెరిసిన కొందరు మహిళా స్వాతంత్ర్య సమరయోధుల గురించి...

రుక్మిణీ లక్ష్మీపతి



ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని మధురైలో పుట్టింది రుక్మిణీ. గాంధీజీ 'హరిజన సంక్షేమ నిధి' కోసం తన బంగారు నగలన్నీ విరాళంగా ఇచ్చేసింది. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో చురుగ్గా పాల్గొంది. ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా అరెస్టయి జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళగా చరిత్రలో నిలిచింది.

సుభద్రా జోషి



గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితం అయిన సుభద్రా జోషి విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొంది. 'హమారా సంగ్రామ్' పత్రికకు ఎడిటర్‌గా పని చేసింది. సుభద్రను అరెస్ట్ చేసి లాహోర్ సెంట్రల్ జైల్‌కు తరలించారు. విడుదలయ్యాక మళ్లీ ఉద్యమంలో భాగం అయింది. సుభద్ర అంకితభావాన్ని నెహ్రూ ప్రశంసించారు.

రాణి మా గైడిన్లియు



బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మొదలైన 'హెరాక' ఉద్యమంలో పదమూడు సంవత్సరాల వయసులోనే పాల్గొంది రాణి మా. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసి మహిళగా చరిత్రకెక్కింది. 'హెరాక' ఉద్యమంతో పాటు ఎదుగుతూ వచ్చిన రాణి మా ప్రముఖ రాజకీయ నాయకురాలిగా, ఆధ్యాత్మిక గురువుగా ప్రఖ్యాతి పొందింది.

బేగం హజ్రత్ మహల్



తొలి తరం మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలు బేగం హజ్రత్ మహల్. బేగం హజ్రత్ ఇతర సంస్థానాధీశులతో కలిసి బ్రిటిష్ వారితో యుద్ధం చేసింది. లక్నో సమీపంలో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారిని ఓడించింది. ఆ తరువాత కాలంలో మాత్రం ఓటమికి గురైంది. బ్రిటిష్ వారికి చిక్కకుండా అడవుల్లో తల దాచుకొని పోరాడేది.

కమలానెహ్రూ



జవహర్‌లాల్ నెహ్రూ సతీమణి కమలా నెహ్రూ మహిళా సాధికారత కోసం గళం విప్పిన యోధురాలు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అరెస్టై జైలుకు వెళ్లింది. 'దేశ సేవిక' సంఘాలను ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగం అయ్యేలా చేసింది.

సుభద్రాకుమారి చౌహాన్



సుభద్రాకుమారి చౌహాన్ కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరిన తరువాత నాగపూర్ నుంచి అరెస్ట్ అయిన మొట్టమొదటి మహిళా సత్యాగ్రహిగా చరిత్రలో నిలిచింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా పోరాడింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఎన్నో త్యాగాలు చేసింది.

అరుణా అసఫ్ అలి



భర్త అసఫ్ అలీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది అరుణ. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయింది. కాంగ్రెస్‌పార్టీ క్విట్ ఇండియా తీర్మానం చేసిన తరువాత బ్రిటిష్ వారు విరుచుకుపడ్డారు. ప్రముఖ నాయకులను అరెస్ట్ చేశారు. ఆ క్లిష్ట సమయంలో అరుణా అసఫ్ అలి కార్యకర్తలకు అండగా ఉంది. బొంబాయి గొవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ జెండాను ఎగరేసి క్విట్ ఇండియా ఉద్యమం ఊపందుకునేలా చేసింది.

దుర్గాబాయి దేశ్‌ముఖ్



దుర్గాబాయి దేశ్‌ముఖ్ సాహసవంతురాలైన సామాజిక కార్యకర్త, చిన్నతనం నుంచే మహిళల హక్కుల కోసం పోరాడింది. మహాత్మా గాంధీ నుంచి స్ఫూర్తి పొంది స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. గాంధీజీ ప్రభావంతో దుర్గాబాయి మాత్రమే కాదు ఆమె కుటుంబం మొత్తం అన్ని రకాల పాశ్చాత్య దుస్తులను విడిచిపెట్టి, ఖాదీని మాత్రమే ధరించేవారు. మద్రాస్‌లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించింది.

రాజ్‌కుమారీ అమృత్ కౌర్



రాజ్‌కుమారీ అమృత్ కౌర్ సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు. గాంధీజీ కార్యదర్శిగా పని చేసిన ఆమె దండి మార్చ్‌లాంటి ఎన్నో జాతీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంది. క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రాజ్‌కుమారి ఇరవై నెలల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. రాచరిక కుటుంబంలో పుట్టినప్పటికీ మహాత్ముడి ఆశ్రమంలో సాధారణ జీవితాన్ని గడిపింది.

మన(సు)లో మాట



మా బాబు ఒకచోట కుదురుగా ఉండటం లేదు...

మా బాబు వయసు 5 సంవత్సరాలు. ఒకచోట నిలకడగా ఉండకుండా, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. ఇంట్లో, స్కూల్లో బయటా కూడా ఇలాగే చస్తుంటాడు. బయట ఫంక్షన్లకు తీసుకెళితే తనను పట్టుకోవడం, తన చుట్టూ తిరగడంతోటే సరిపోతుంది. అందువల్ల ఈ మధ్య బయటకు వెళ్లడం కూడా తగ్గించేశాం. వాళ్ల నానమ్మేమో, ఇది పిల్లల్లో మామూలే అంటుంది. ఈ మధ్య వాళ్ల స్కూల్ టీచర్ మమ్మల్ని పిలిచి, మా బాబు మీద అనేక కంప్లయింట్లు చెప్పింది. మాకు చాలా ఆందోళనగా ఉంది.

– కె. మాధవి, సికింద్రాబాద్

పిల్లల మెదడులో ఉండే సెల్ఫ్ కంట్రోల్ విభాగం లోని లోపాల వల్ల, వారసత్వ లక్షణాల రీత్యా, కొందరు పిల్లలకు మీరు చెప్పిన లక్షణాలు రావచ్చు. దీనిని హైపర్ యాక్టివిటీ లేదా ఏడీహెచ్‌డీ అంటారు. నిలకడ లేకపోవడం, చదువు మీద ఏకాగ్రత లేకపోవడం, వస్తువులు విసిరేయడం, సహనం లేకపోవడం, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉండటం, స్కూల్‌లో వస్తువులు మరచిపోవడం, ఈ సమస్య ముఖ్య లక్షణాలు. వీరికి తెలివితేటలు బాగానే ఉన్నప్పటికీ, ఏకాగ్రత లోపించడం వల్ల చదువులో వెనకబడతారు. ఇలాంటి వారిని ఎంత చిన్నవయసులో గుర్తించి, సరియైన చికిత్స చేయిస్తే అంత తొందరగా దీంట్లోంచి బయట పడతారు. ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, అవసరమైతే కొద్ది మోతాదులో కొన్ని మందులు వాడటం ద్వారా వీరిని పూర్తిగా బాగు చెయ్యొచ్చు. పేరెంట్స్, టీచర్లు ఇలాంటి వారిని త్వరగా గుర్తించగలిగితే తొందరగా బాగుపడతారు. మైకేల్ ఫిలిప్స్ అనే స్విమ్మర్ ఈ సమస్యతో బాధపడుతూ చికిత్స తీసుకుని బాగుపడి, ఒలింపిక్స్‌లో 20కి పైగా స్వర్ణ పతకాలు సాధించాడు. చైల్డ్ సైకియాట్రిస్ట్‌ల సూచనలు తీసుకోవడం, పాటించడం మేలు చేస్తుంది.




- డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

---

హెల్దీ డైట్

సగ్గుబియ్యం పొంగనాలు



కావలసినవి: సగ్గుబియ్యం – అర కప్పు (గంట సేపు నానబెట్టాలి); పనీర్ తురుము – 75 గ్రాములు; వేరుశనగపప్పుల పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; క్యారట్ తురుము – 3 టేబుల్ స్పూన్‌లు ; బంగాళదుంప – 1 (ఉడికించి తొక్క తీసి చిదమాలి); జీలకర్ర పొడి– టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; క్యాబేజ్ తరుగు – ముప్పావు కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు (రెడ్, గ్రీన్ క్యాప్సికమ్); చీజ్ తురుము – 50 గ్రాములు (12 భాగాలు చేసుకోవాలి); నూనె – టీ స్పూన్.

తయారీ: ● ఒక పాత్రలో క్యాబేజ్ తురుము, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఐదు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఇందులో నూనె, చీజ్ మినహా మిగిలినవన్నీ వేసి బాగా కలిపి పన్నెండు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో చీజ్ స్టఫ్ చేస్తూ గోళీలాగా చేయాలి ● గుంత పొంగనాల పెనం వేడి చేసి ఒక్కో గుంతలో ఒక్కో చుక్క నూనె రుద్ది పొంగనాన్ని పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు కాలిన తర్వాత రెండోవైపు కాల్చాలి.

పోషకాలు: (ఒక్కో పొంగనంలో)...
● కేలరీలు 63; ● ప్రొటీన్ – 2.5 – 3 గ్రాములు; ● కార్బోహైడ్రేట్లు – 8–9 గ్రాములు; ● ఫ్యాట్ – 2–3 గ్రాములు; ● ఫైబర్– గ్రాము; క్యాల్షియం – 40 –50 గ్రాములు.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

అరుదైన ఆహ్వానం

12 ఏళ్లు... 15 లైబ్రరీలు

ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న ఇరవై మందిలో విద్యార్థులు ఆరుగురు. వారిలో అమ్మాయి ఒకే ఒక్కరు. ఆ సరస్వతి పుత్రిక పేరు ఆకర్షణ. లైబ్రరీలు స్థాపిస్తూ సాహిత్యాన్ని సామాన్యులకు దగ్గర చేస్తున్న ఆమె అక్షరసేవకు జాతీయ స్థాయిలో అందిన గుర్తింపు ఇది.



● సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతితో...

''హైదరాబాద్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్‌మాస్టర్ నుంచి 12వ తేదీన నాన్నకు ఫోన్ వచ్చింది. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 15వ తేదీన ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కావలసిందిగా మీ అమ్మాయి ఆకర్షణకు ఆహ్వానం వచ్చిందని చెబుతూ అభినందనలు తెలియచేశారు'' అంటూ తాను లైబ్రరీ వ్యవస్థాపకురాలిగా మారిన వివరాలను సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు ఆకర్షణ సతీష్.

కోవిడ్ వచ్చినప్పుడు

''హైదరాబాద్‌లో స్థిరపడిన తమిళ కుటుంబం మాది. నాన్న సతీశ్ క్యాన్సర్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ ఉద్యోగి. నేను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాను. పుస్తక పఠనం నా హాబీ కావడంతో వెయ్యికి పైగా పుస్తకాలతో ఇంట్లోనే నాకు సొంత లైబ్రరీ ఉంది. ఇతరుల కోసం లైబ్రరీ స్థాపించాలనే ఆలోచన కోవిడ్ సమయంలో వచ్చింది.

తొలి లైబ్రరీ క్యాన్సర్ హాస్పిటల్‌లో

నాన్న ఉద్యోగరీత్యా క్యాన్సర్ హాస్పిటళ్లకు టచ్‌లో ఉంటారు. కోవిడ్ సమయంలో ఎమ్ఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వాళ్లు 'కోవిడ్ కారణంగా వంటవాళ్లు డ్యూటీకి రావడం లేదు. పేషెంట్‌లకు ఆహారం అందించడానికి ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేసి పెట్టవలసింది'గా కోరడంతో నాన్న వాళ్ల కోసం రోజూ భోజనం వండించి తీసుకెళ్లి ఇచ్చేవారు. నాకు స్కూల్ లేకపోవడంతో రోజూ నాన్నతోపాటు హాస్పిటల్‌కి వెళ్లేదాన్ని. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న పేషెంట్‌లలో నా ఏజ్ గ్రూప్ వాళ్లతో స్నేహం ఏర్పడింది. వాళ్లు కొంతమంది చదువుకోవడానికి పుస్తకాలు తెచ్చిపెట్టమని అడిగారు. రోజూ నా పుస్తకాలు కొన్ని తీసుకెళ్లి ఇస్తూ ఉన్నప్పుడు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జయలత గారు... 'హాస్పిటల్‌కి చికిత్స కోసం ఎప్పుడూ కొత్తవాళ్లు వస్తుంటారు. హాస్పిటల్‌లోనే లైబ్రరీ ఉంటే బావుంటుంది' అన్నారు. వారి ఆలోచనే నా లైబ్రరీ ఉద్యమానికి నాంది. నా పుస్తకాలతోపాటు మా స్కూల్, అపార్ట్‌మెంట్ స్నేహితుల నుంచి సేకరించిన వెయ్యికి పైగా పుస్తకాలతో తొలి లైబ్రరీ అలా మొదలైంది. ఇప్పటికి 9,836 పుస్తకాలతో 15 లైబ్రరీలు ఏర్పాటు చేయగలిగాను.

పదకొండు వేల పుస్తకాలు

నాలుగేళ్లలో పదకొండు వేల పుస్తకాలు సేకరించాను. అందులో రెండు వేల పుస్తకాలు ప్రధాని నరేంద్రమోదీగారిచ్చారు. ఈ ఏడాది మార్చి 18న కోయంబత్తూరులో ఆయనను కలిసే అవకాశం వచ్చింది. ఆ సందర్భంగా ఆయన 25 లైబ్రరీలు స్థాపించమని, 25 లైబ్రరీ స్థాపనకు స్వయంగా హాజరవుతానని చెప్పారు. భారత రాష్ట్రపతి గత ఏడాది శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కి వచ్చినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కలిశాను. అప్పుడామె 'ప్రజల్లో రీడింగ్ హ్యాబిట్ తగ్గుతోంది, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి దోహదం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని కొనసాగించ'మని చెప్పి ఆమే స్వయంగా 74 పుస్తకాలిచ్చారు. ఈ ఏడాది ఢిల్లీ, కర్తవ్య పథ్‌లో జరిగిన 75వ రిపబ్లిక్ డే ఉత్సవాలకు ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరయ్యాను. ఇదే ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలకు కూడా హాజరయ్యే అవకాశం కలగడం సంతోషంగా ఉంది'' అంటూ 25 లైబ్రరీల లక్ష్యాన్ని పూర్తి చేస్తానని చెప్పింది ఆకర్షణ సతీశ్.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మంత్రి తుమ్మలను విమర్శిస్తే సహించం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

సత్తుపల్లి: ఉమ్మడి ఖమ్మంజిల్లాకు గోదావరి జలాలను తీసుకురావటమే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిరకాల కోరిక.. దాని కోసం శ్రమిస్తున్న తుమ్మలను మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించటం సహించమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 90శాతం పనులు ఎక్కడ జరిగాయో చెప్పాలని, 30 శాతం పనులు కూడా చేయలేదని రూ.8వేల కోట్లు ఎక్కడ ఖర్చుపెట్టారో ఆ డబ్బులు ఎక్కడికి వెళ్లాయో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మా మంత్రులను విమర్శిస్తే ఊరుకునేదే లేదని, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. తల్లాడలో మిషన్‌భగీరథ నీరు ఆకుపచ్చరంగులో వస్తున్నాయని దీనిపై ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నర్సింహారావు, అప్పారావు, శివ వేణు, చెన్నారావు, కృష్ణ, సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, గఫార్‌ఖాన్, నాగలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, శ్రీను, గోపాలరావు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి


వైరారూరల్: రెబ్బవరంలో తిలకం పెట్టి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైరారూరల్/ఎర్రుపాలెం: వైరాలో జరిగే సీఎం రేవంత్ రెడ్డి రైతు సదస్సు బహిరంగ సభకు రైతులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కిసాన్ ఖేత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి దానియేలు, మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి వైరా మండలంలోని రెబ్బవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదే విధంగా ఎర్రుపాలెం మండలకేంద్రంలోని రింగ్ సెంటర్‌లోని శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాదం రామారావు, గుత్తా కళావతి, గుత్తా రామారావు, గుత్త కొండలరావు, అంజయ్య, దాసు, ఆనందరావు, నాయకులు పూర్ణ చంద్రారెడ్డి, నర్సింహారావు, నాగిరెడ్డి, శ్రీనివాసరావు, పుల్లారెడ్డి, లక్ష్మణరావు, ఇస్మాయిల్, రాజీవ్ గాంధీ, శ్రీనివాసరెడ్డి, సాయికుమార్, వెంకటనర్సయ్య, జానీబాషా, వెంకటరత్నం, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ లేదంటూ.. బంధువుల ఆందోళన

పెనుబల్లి: మండలంలోని సూరయ్యబంజర్ గ్రామానికి చెందిన ప్రశాంత్ బుధవారం పొలం పనులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. ఇది గమనించి తోటి కూలీలు ఆ పామును చంపి.. ప్రశాంత్‌ను, పామును పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యంకోసం ఖమ్మానికి రిఫర్ చేశారు. కానీ ఖమ్మం తీసుకెళ్లడానికి అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో బాధిత బంధువులు ఆందోళన చేశారు. అనంతరం ప్రైవేట్ అంబులెన్స్‌లో ఖమ్మం తరలించారు.

త్రివర్ణ పతాకాలతో విద్యార్థులు


బోనకల్ పాఠశాలలో త్రివర్ణ పతాకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సత్తుపల్లిటౌన్/బోనకల్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం సత్తుపల్లిలోని వాణి విద్యాలయం విద్యార్థులు, బోనకల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు త్రివర్ణ పతాకాలను ప్రదర్శించారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీను పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలకు త్రివర్ణ పతాకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోత్ నాగేశ్వరరావు, మండలాధ్యక్షుడు అప్పారావు, రాజ్యం, సంగీత తదితరులు పాల్గొన్నారు.











పరిశుభ్రంగా ఉంచాలి

ముదిగొండ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ శ్యాంసన్ హాస్టల్ సిబ్బందికి సూచించారు. హాస్టల్‌లోని భోజన వసతి, వంట సరుకులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9, 10 వార్డుల్లో కలుపు మొక్కల నిర్మూలనకు బుధవారం గడ్డి మందు పిచికారీ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత ఆధ్వర్యంలో సొంత నిధులతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలకు కలుపు మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువల్లో, రోడ్ల వెంబడి గడ్డి, కలుపు మొక్కలను తొలగించాలని పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పారిశుద్ధ్య పనులు నిరంతరాయంగా జరుగుతాయని తెలిపారు.

ముదిగొండలో డెంగీ కేసులు

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురం, కేజీబీవీలో విద్యార్థినులకు, ముదిగొండ, వెంకటాపురం, మేడేపల్లి గ్రామాల్లో డెంగి జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. దీంతో జిల్లా మలేరియా వైద్యాధికారి వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో పర్యటించి, అనంతరం కేజీబీవీ స్కూల్‌లో పరిసరాలను పరిశీలించారు. జ్వరాలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రాణి, ఫార్మసిస్ట్ సత్యావతి, కుమారి, రామారావు లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

సత్తుపల్లిటౌన్: ఐసీడీఎస్ సత్తుపల్లి ప్రాజెక్ట్ పరిధిలోని సత్తుపల్లి-3, పాలవాడ, మసీదు గట్టు అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ కనకదుర్గా బుధవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లలోని రికార్డుల ఆధారంగా స్టాక్ పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

వైరారూరల్: వైరా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. బుధవారం ముసలిమడుగులో రైతు నేత నర్వనేని సత్యనారాయణ 3వ వర్ధంతిని నిర్వహించి నర్వనేని స్మారక స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వైరా రిజర్వాయర్ చుట్టూ ట్యాంక్‌బండ్, డంపింగ్ యార్డు నిర్మాణం, ప్రభుత్వ దుకాణాల ఆదాయ సముదాయంతో పాటు తదితర అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి వైరా నియోజకవర్గ అభివృద్ధి సీఎం బాటలు వేయాలన్నారు. సామినేని రామారావు, తోట నాగేశ్వరరావు, సుంకర సుధాకర్, వనమా చిన్న సత్యనారాయణ, చింత నిప్పు చలపతిరావు, బాజోజు రమణ, నల్లమల్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

















విద్యుత్‌ను పొదుపుగా వాడుకోండి

కొణిజర్ల: వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకుని ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఖమ్మం ట్రాన్స్‌కో (ఆపరేషన్స్) డీఈ నంబూరి రామారావు అన్నారు. బుధవారం కొణిజర్ల మండలం రాజ్యాతండా, తనికెళ్ల, ఎస్ఆర్ నగర్‌లలో లో ఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు గాను ఏర్పాటు చేసి 40కేవీ ట్రాన్స్‌ఫార్మర్, 25కేవీ సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పెద్దగోపతి ఏడీఈ ఎల్ తిలక్, ఏఈ రాయల సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కొణిజర్ల: మండలంలోని ఎల్లన్ననగర్‌లో గత 30 ఏళ్లుగా పోడు సాగు చేసుకుని జీవిస్తున్న గిరిజనులు, గిరిజనేతరులకు పోడుసాగు పట్టాలు ఇప్పించాలని కోరుతూ.. బుధవారం ఎల్లన్ననగర్ గ్రామస్తులు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు వినతి పత్రం అందించారు. గ్రామంలో దాదాపు 200 కుటుంబాలు నివసిస్తున్నారని.. గ్రామానికి రహదారి సౌకర్యం లేదని, బడి, ఇందిరమ్మ ఇళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అటవీ హక్కుల కమిటీ సభ్యులు లాల్‌సింగ్, కృష్ణ, మాస్‌లైన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో బోనాల వేడుకలు

కారేపల్లి: కారేపల్లిలోని మహిళలు బోనాలను ఎత్తుకుని ముత్యాలమ్మ తల్లికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శివశక్తి కీర్తి నాట్యం అలరించింది.

